www.aksharadarbar.com
శక్రవారం 31, మే 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :100 | సంపుటి :02 | పేజీలు : 04 | వెల : 05

జిల్లాలో విత్తనాల కొరత లేదు

- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

03

ఏసీబీ దూకుడు

- అవినీతి పరుల్లో దడ
- వరుసగా పట్టుబడుతున్న లంచగొండి అధికారులు
- హైదరాబాద్ లో ఏసీబీకి చిక్కిన అవినీతి తిమింగళాలు

- లోపలి పేజీల్లో

అవినీతిపై ఏసీబీ దూకుడు పెంచుతోంది. ప్రజలను ముప్పుతిప్పలు పెడుతూ రూ.కోట్లు గడిస్తున్న లంచగొండి అధికారులపై ఉక్కు పాదం మోపుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి తిమింగళాల భరతం పడుతోంది. వరస దాడులతో హడలెత్తిస్తోంది. అన్ని శాఖల అధికారులపై నిఘా పెంచుతూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోంటోంది. శుక్రవారం రంగారెడ్డి జిల్లాల్లో నీటి పారుదల శాఖ ఇంజినీర్లను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అలాగే హైదరాబాద్ లోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో రూ.3లక్షలు లంచం తీసుకుంటుండగా ఇన్ స్పెక్టర్ జి.వీరస్వామి, ఎస్ ఐ షఫీను అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా దొరికారు.

—అక్షర దర్బార్, హైదరాబాద్

కొర్రీల కలెక్షన్

- అక్రమార్జనే లక్ష్యంగా తెరపైకి సాకులు
- ప్రతి పనికి ముందుగానే ఒక రేటు ఫిక్స్
- ఇంటి అనుమతి పత్రాల పేరుతో వసూళ్ల పర్వం
- ఇండ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఫేక్ అనుమతి పత్రాలు
- భాగాలుగా నాలా కన్వర్షన్ భూముల రిజిస్ట్రేషన్
- అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న దందా
- అక్రమాల చిట్టాపై నిఘా వర్గాల ఆరా

02

అక్రమాలకు కేరాఫ్ గా మారుతోంది పరకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం. అక్రమార్జనే లక్ష్యంగా ఇక్కడ కొర్రీల కలెక్షన్ నడుస్తుంది. ఏదో ఒక సాకుతో అందినకాడికి దండుకునే పనిలో కొందరు ఉన్నారు. ప్రతి పనికి ముందుగానే రేటు ఫిక్స్ చేసి వసూళ్లకు తెగబడుతున్నారు. ఇంటి నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వ్యక్తుల నుంచి నిర్మాణ అనుమతి పత్రం ఉంటే ఒక రేటు... లేకుంటే ఇంకో రేటు అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. అనుమతి పత్రం సంగతి తాము చూసుకుంటామని చెప్పి ఫిక్స్ డ్ అమౌంట్ గుంజుతున్నారు. ఈ క్రమంలో నకిలీ అనుమతి పత్రాలను సైతం సృష్టించి వాడుతున్నట్లు టాక్. ఇక ప్లాట్ల రిజిస్ట్రేషన్లలోనూ అక్రమ దందా సాగుతున్నట్లు సమాచారం. నాలా కన్వర్షన్ జరిగిన ఒక డాక్యుమెంట్ లోని భూమిని భాగాలుగా కూడా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిసింది. అంతేకాదు ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో వెలసిన కొన్ని వెంచర్లలోని నాన్ లే అవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లూ జరిగినట్లు సమాచారం. కేసులు ఉన్నాయనే సాకుతోనూ ఇక్కడ రిజిస్ట్రేషన్ కోసం తమను సంప్రదించే వ్యక్తుల నుంచి డబ్బు గుంజి పని చేసి పెడుతున్నట్లు తెలిసింది. ముడుపులు ముడితే నిబంధనలు చెల్లవనే రీతిలో వసూళ్ల పర్వం కొనసాగుతుండటం సర్వత్రా చర్చనీయాశమైంది. ఈ వ్యవహారంపై తాజాగా ప్రభుత్వ నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం. – అక్షర దర్బార్, నిఘా విభాగం

6నుంచి సహకార సంఘాల ఎన్నికలు

జూన్ 6వ తేదీ నుంచి 28వ తేదీ వరకు సహకార సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి తెలిపారు. ఎన్నికలు జరగని సహకార సంఘా లకు ఎన్నికల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆయన సూచించారు. చేనేత, కల్లుగీత, మత్స్య, అర్బన్ సహకార బ్యాంక్ తదితర సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

— అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

హై అలర్ట్

4వరకు భానుడి ప్రతాపం

వాతావరణ శాఖ హై అలర్ట్ ప్రకటించింది. జూన్ 4 వరకు భానుడు తన తీవ్ర ప్రతాపాన్ని చూపనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎవరూ బయటకు (ఓపెన్ స్కై కింద) వెళ్లకూడదని సూచించారు. ఉష్ణోగ్రత 45 డిగ్రీల సెల్సియస్ నుంచి 55 డిగ్రీల సెల్సియస్ కు వెళుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఎవరైనా అస్వస్థతకు గురైనట్లయితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని, మొబైల్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

- అక్రమార్జనే లక్ష్యంగా తెరపైకి సాకులు
- ప్రతి పనికి ముందుగానే ఒక రేటు ఫిక్స్
- ఇంటి అనుమతి పత్రాల పేరుతో వసూళ్ల పర్వం
- ఇండ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఫేక్ అనుమతి పత్రాలు
- భాగాలుగా నాలా కన్వర్షన్ భూముల రిజిస్ట్రేషన్
- అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న దందా
- అక్రమాల చిట్టాపై నిఘా వర్గాల ఆరా

కొర్రీల కలెక్షన్

అక్షర దర్బార్, నిఘా విభాగం: అక్రమాలకు కేరాఫ్ గా మారుతోంది పరకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం. అక్రమార్జనే లక్ష్యంగా ఇక్కడ కొర్రీల కలెక్షన్ నడుస్తోంది. ఏదో ఒక సాకుతో అందినకాడికి దండుకునే పనిలో కొందరు ఉన్నారు. ప్రతి పనికి ముందుగానే రేటు ఫిక్స్ చేసి వసూళ్లకు తెగబడుతున్నారు. ఇంటి నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వ్యక్తుల నుంచి నిర్మాణ అనుమతి పత్రం ఉంటే ఒక రేటు... లేకుంటే ఇంకో రేటు అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. అనుమతి పత్రం సంగతి తాము చూసుకుంటామని చెప్పి ఫిక్స్ డ్ అమౌంట్ గుంజుతున్నారు. ఈ క్రమంలో నకిలీ అనుమతి పత్రాలను సైతం సృష్టించి వాడుతున్నట్లు టాక్. ఇక ప్లాట్ల రిజిస్ట్రేషన్లలోనూ అక్రమ దందా సాగుతున్నట్లు సమాచారం. నాలా కన్వర్షన్ జరిగిన ఒక డాక్యుమెంట్ లోని భూమిని భాగాలుగా కూడా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిసింది. అంతేకాదు ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో వెలిసిన కొన్ని వెంచర్లలోని నాన్ లే అవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లూ జరిగినట్లు సమాచారం. కేసులు ఉన్నాయనే సాకుతోనూ ఇక్కడ రిజిస్ట్రేషన్ కోసం తమను సంప్రదించే వ్యక్తుల నుంచి డబ్బు గుంజే పని చేసి పెడుతున్నట్లు తెలిసింది. ముడుపులు ముడితే నిబంధనలు చెల్లవనే రీతిలో వసూళ్ల పర్వం కొనసాగుతుండటం సర్వత్రా చర్చనీయమైంది. ఈ వ్యవహారంపై తాజాగా ప్రభుత్వ నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ఫీజు రూ.4500.. ముడుపులు రూ.75 వేలు

వారసత్వంగా వస్తున్న ఆస్తిని వారసులు పంచుకునేందుకు పార్టీషన్ డీడ్ ను ఉపయోగిస్తారు. పార్టీషన్ డీడ్ ద్వారా తమ ఆస్తిని పంచుకునే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో పరకాల మున్సిపాలిటీ పరిధిలోని ఓ వార్డులో ఏడు ఇంటి నెంబర్లు కలిగిన ఆస్తికి సంబంధించిన కుటుంబ సభ్యులు కొద్ది నెలల క్రితం పార్టీషన్ డీడ్ ద్వారా తమ పేర రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈ ఇంటి నంబర్లు గల ఆస్తి తమ తల్లిదండ్రుల పేర ఉందని, వారు చనిపోయినందున దీన్ని ఇంటి నెంబర్ల ఆధారంగా వారసులమైన తమ ముగ్గురి పేర రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. అవసరమైన డెత్, ఫ్యామిలీ సర్టిఫికెట్లు అందజేశారు. అయితే ఏడు ఇంటి నెంబర్లు ఉన్నా సదరు ఇండ్ల నిర్మాణానికి స్థానిక గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ ద్వారా గాని పొందిన అనుమతి పత్రం లేదనే కారణంతో వారసుల పేర రిజిస్ట్రేషన్ చేయడానికి ఆఫీస్ లో నిరాకరించారు. దీంతో ఎప్పుడో తమ తల్లిదండ్రులు కట్టిన ఇండ్లకు వచ్చిన ఇంటి నెంబర్ల ద్వారా పన్ను చెల్లిస్తూ వస్తున్న తాము ఇప్పుడు ఎక్కడ అనుమతి పత్రం చూపగలమని వారసులు తల పట్టుకున్నారు. చివరకు ఈ ఆఫీస్ లో అన్ని పనులు సక్కబెట్టే ఓ వ్యక్తిని సంప్రదించారు. ఇంకేముంది మొదట ససేమిరా అన్న ఈ ఆఫీసులో ఆ తర్వాత ఏడు ఇంటి నెంబర్లు కలిగిన ఈ ఆస్తులు ముగ్గురి పేర పార్టీషన్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు సమాచారం. ఈ రిజిస్ట్రేషన్ కోసం ఒక్కొక్కరు రూ 4,500 చొప్పున ఫీజు రూపంలో చెల్లించిన మొత్తం కేవలం రూ.13,500 ప్రభుత్వ ఖజానాకు జమ కాగా సదరు ముగ్గురు సమర్పించుకున్న ముడుపులు రూ.2 లక్షలు దాటినట్లు తెలిసింది. పార్టీషన్ డీడ్ రిజిస్ట్రేషన్లలో ఇది ఓ మచ్చుతునక మాత్రమే. ఇలాంటివి ఈ కార్యాలయం పరిధిలో గల ఐదు మండలాలకు చెందిన వెన్నో ఇక్కడ జరిగినట్లు టాక్.

నకిలీ అనుమతి పత్రాలు

కొద్ది నెలల క్రితం పరకాల మున్సిపాలిటీ పరిధిలోని ఒకరు కుటుంబ అవసరాల కోసం తమ ఇంటిని విక్రయించారు. ఎప్పుడో కట్టిన ఈ ఇంటికి గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ నుంచి గాని నిర్మాణం అనుమతి పత్రం లేదు. అయితే కొనుగోలు చేసిన వ్యక్తికి ఇంటి నెంబర్ ఆధారంగా తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయడానికి అమ్మకందారు స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని సంప్రదించాడు. ఇంటి పన్ను కడుతున్నంత మాత్రాన కేవలం ఇంటి నెంబర్ ఆధారంగానే ఇల్లు రిజిస్ట్రేషన్ చేయలేమని ఈ కార్యాలయం నుంచి సమాధానం ఎదురైంది. దీంతో చేసేదేమీ లేక ఆఫీసులో అన్నీ తానై వ్యవహరించే వ్యక్తి లైన్ లోకి వెళ్ళాడు. సరే అన్ని చూసుకుంటామని చెప్పి ఇంటి నిర్మాణ అనుమతి పత్రం కోసం రూ.40 వేలు, రిజిస్ట్రేషన్ కు రూ.30 వేలు ఖర్చు అవుతుందని సదరు వ్యక్తి సెలవిచ్చాడు. దీంతో విధిలేని పరిస్థితిలో ఓకే చెప్పేసి రూ.70 వేలు సమర్పించుకోవటం ద్వారా రిజిస్ట్రేషన్ పని పూర్తి చేసుకున్నాడు. విశేషం ఏమిటంటే ఈ అనుమతి పత్రం 40 సంవత్సరాల క్రితం పరకాల మేజర్ గ్రామపంచాయతీగా కొనసాగిన సమయంలో పొందినదిగా డాక్యుమెంట్లకు జత చేశారు. అయితే ఇది ఫేక్ అనుమతి పత్రం అని, నకిలీవి సృష్టించి ఇలా కేవలం ఇంటి నెంబర్లతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారి నుంచి డబ్బులు గుంజి ఇక్కడ ఈ ఫేక్ అనుమతి పత్రాలను వాడుతున్నట్లు తెలిసింది. ఇలా ఒకటి రెండు కాదు చాలా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుస్తోంది. పరకాల మేజర్ గ్రామ పంచాయతీగా కొనసాగిన సమయంలో అక్రమార్జన కోసం అప్పటి తేదీలపై ఫేక్ పత్రాలను వాడేందుకు కొందరు నకిలీ బుక్స్ అందుబాటులో పెట్టుకున్నారని కూడా ప్రచారంలో ఉంది. ఇంటి నెంబర్లతో జరిగిన రిజిస్ట్రేషన్లపై లోతుగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అందుబాటులో పత్తి విత్తనాలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అక్షర దర్బార్, హైదరాబాద్: డిమాండ్ కు తగ్గట్టు పత్తి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శుక్రవారం మంత్రి జిల్లాల వారీగా విత్తన సరఫరాపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గతేడాది 1000 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు పంపిణీ కాగా ఈ ఏడాది 1800 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని వాటిని రైతులకు సరఫరా చేస్తున్నామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా పత్తి విత్తన ప్యాకెట్లు సమృద్ధిగా ఉన్నాయని, రైతుల కోరిక మేరకు ఒక కంపెనీకు చెందిన విత్తన ప్యాకెట్లు గతేడాది కంటే 30వేల ప్యాకెట్లు అదనంగా ఇవ్వడానికి ఆ కంపెనీ సంసిద్ధత వ్యక్తం చేసిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాల కలెక్టర్లు స్వయంగా పర్యటిస్తూ విత్తన సరఫరాని సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం రాష్ట్రంలో పచ్చిరొట్ట విక్రయాలు 26,997 క్వింటాలు ఉండగా, ఈ సంవత్సరం 58,565 క్వింటాలు పంపిణీ చేశామన్నారు. పత్తి ప్యాకెట్లు గత సంవత్సరం 45 లక్షలు అందుబాటులో ఉంచగా ఈ సంవత్సరం ఇప్పటికీ 75 లక్షలు ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని వివరించారు. మిగతావి కూడా జూన్ 5లోపు సరఫరా చేయాల్సిందిగా పత్తి కంపెనీలకు ఆదేశాలు ఇచ్చామని మంత్రి పేర్కొన్నారు.

ఏసీబీకి పట్టుబడ్డ పోలీసులు

అక్షర దర్బార్, హైదరాబాద్: హైదరాబాద్ కుషాయిగూడలో యాంటీ కరప్షన్ బ్యూరో(ఏసీబీ) దాడులు చేసింది. శుక్రవారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇన్ స్పెక్టర్ జి. వీరస్వామి, ఎస్సై షఫీలను లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఓ ల్యాండ్ కేసును క్లోజ్ చేయడానికి రూ.3 లక్షలు లంచం డిమాండ్ చేయడంతో బాధితులు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. దీంతో ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్ వేసి పట్టుకున్నారు. సీఐ, ఎస్సై, కానిస్టేబుల్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు విచారించారు.

పొగాకు మహమ్మారికి దూరంగా ఉండాలి

ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

అక్షర దర్బార్,ములుగు జిల్లా ప్రతినిధి: ఏటూరునాగారం సామాజిక ఆసుపత్రిలో శుక్రవారం పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ.. ఈ ఏడాది థీమ్"పొగాకు పరిశ్రమ నుండి పిల్లలను రక్షించడం" అని తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ధూమపానం చుట్టు పక్కల వారి ఆరోగ్యానికి కూడా హాని చేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో రోహిత్ పీహెచ్ సీ మెడికల్ ఆఫీసర్ ఏ.సుమలత, ఆయుష్ మెడికల్ ఆఫీసర్, హెల్త్ ఎడ్యుకేషన్ స్వరూప రాణి, సూపర్ వైజర్ కమల తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగుకు పకడ్బందీగా ఏర్పాట్లు

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

లెక్కింపుకు 22 రౌండ్స్ , 22 టేబుల్స్ ఏర్పాటు.
అక్షర దర్బార్,ములుగు జిల్లా: పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొరపాట్లు లేకుండా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారిని, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రాతో కలిసి కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణపై అవగాహన కల్పించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సిబ్బంది ఎలాంటి పొరపాట్లు జరగకుండా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జీ, ములుగు తహసీల్దార్లు విజయభాస్కర్, రవీందర్, ఎలక్షన్ సెల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విత్తనాల కొరత లేదు

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

నగరంలో విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: జిల్లాలో విత్తనాల కొరత లేదని, ఎవరైనా కృత్రిమంగా విత్తనాల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హెచ్చరించారు. నకిలీ విత్తనాల వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కంట్రోల్ రూంలో రైతుల కోసం ఫోన్ నెంబర్ 7288894714 ఏర్పాటు చేసామన్నారు. విత్తనాల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె ధైర్యాన్నిచ్చారు. అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో విత్తనాల లభ్యత, వానాకాలం సాగుపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఈసారి ముందుగానే రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించనున్నాయని అన్నారు. జిల్లాలో వచ్చే వానాకాలం ఈ సంవత్సరం లక్ష 5 వేల ఎకరాలలో వరి, 1 లక్ష 28 వేల ఎకరాలలో పత్తి, 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న 15 వేల ఎకరాలలో మిరప పంట సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా, పత్తి విత్తనాలు, ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువ అమ్మినా నేరుగా కంట్రోల్ రూమ్ లో సంప్రదించాలని సూచించారు. ప్రతి ఫర్టిలైజర్ డీలర్ షాప్ వద్ద కంట్రోల్ రూమ్ నంబర్ ప్రదర్శించాలని ఆదేశించామన్నారు. లైసెన్స్ డ్ డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే ముందు రైతులు గడువు తేదీ, పాకెట్ సీల్ మొదలగు విషయాలు పరిశీలించుకోవాలన్నారు. నిషేధంలో ఉన్న డీటీసీ సీ 70 విత్తనాలను రైతులు కొనుగోలు చేయవద్దన్నారు. జిల్లాకు 3 లక్షల 50 వేల పత్తి విత్తనాలు అవసరం ఉండగా 5 లక్షల 25వేల విత్తన ప్యాకెట్లను వివిధ విత్తన దుకాణాల డీలర్ల వద్ద అందుబాటులో ఉంచామని, ఇప్పటివరకు లక్ష 50 వేల విత్తనాలు విక్రయించబడ్డాయన్నారు. విత్తనాలు కొరత ఉన్నట్లు రైతులను తప్పు దోవ పట్టిస్తున్నారని, అపోహలు సృష్టిస్తున్నారని అలాంటి తప్పుడు సమాచారాన్ని రైతులు నమ్మొద్దని అన్నారు. విత్తనాలు కొనుగోలులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని అన్నారు. నకిలీ విత్తనాలపై అవగాహన పెంపొందించుకోవాలని దళారులను నమ్మి తక్కువ ధరకు వస్తుందని ఎటువంటి రసీదు, బిల్లు లేని నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి నష్టపోవద్దని సూచించారు. నకిలీ విత్తనాలు నియంత్రణకై ప్రభుత్వం రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో టాస్క్ ఫోర్స్ కమిటీ వేసిందని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయాలపై పటిష్టమైన నిఘా పెట్టామని అన్నారు. ఇప్పటికే 2 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా జిల్లాలోని క్లస్టర్లలో రైతు వేదికలలో విత్తనాలు కొనుగోళ్లు, అధిక దిగుబడులపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. రైతులు విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మేలైన విత్తనాలను కొనుగోలు చేసి అధిక దిగుబడి సాధించాలన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ

విత్తన దుకాణాలను కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం తనిఖీ చేశారు. వరంగల్ నగరంలోని దేవి సీడ్స్, గణపతి, పున్నమి, సీతారామ తదితర విత్తన విక్రయ దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన రిజిస్టర్, విత్తనాల ప్యాకెట్లను, స్టాకును పరిశీలించారు. స్టాకు వివరాలు బోర్డులపై రాయాలని ఆమె వ్యాపారులకు సూచించారు. నాణ్యమైన విత్తనాలను అమ్మాలని, గడువు తీరిన, సీల్ లేనివి, ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలను విక్రయించొద్దని దుకాణ యజమానులకు సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు రైతులకు తప్పని సరిగా రసీదు ఇవ్వాలని, కొనుగోలు, అమ్మకాలపై స్టాకు రిజిస్టర్ నిర్వహించాలని తెలిపారు. కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ అధికారి ఉషా దయాల్, ఏడీఏ సురేష్, ఏవోలు విజ్ఞాన్, సారంగం తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

'సంరక్ష' లో ఆందోళన

మహిళ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ధర్నా

అక్షర దర్బార్ వరంగల్ ప్రతినిధి: హాస్పిటల్ కు చికిత్స కోసం వచ్చిన మహిళ మృతికి హాస్పిటల్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని మృతురాలి బంధువులు ఆందోళనకు దిగిన ఘటన శుక్రవారం జరిగింది. వాణి అనే మహిళ అనారోగ్యానికి గురికాగా నర్సంపేట రోడ్డులోని సంరక్ష హాస్పిటల్ కు బంధువులు ఇటీవల తీసుకెళ్లారు. సరైన చికిత్స అందించకపోవడంతో ఆమె పరిస్థితి విషమంగా మారిందని బంధువులు ఆరోపించారు. రెండు రోజుల క్రితం హుటాహుటిన హైదరాబాద్ తీసుకెళ్లాలని ఆస్పత్రి సిబ్బంది హడావుడి చేసి పంపించారని పేర్కొన్నారు. అక్కడ చికిత్స పొందుతున్న వాణి మృతి చెందింది. ఆమె మృతికి సంరక్ష హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. డెడ్ బాడీతో హాస్పిటల్లో నిరసన చేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. హాస్పిటల్ ఆవరణలో చితి లాగా కట్టెలు పేర్చి బైఠాయించారు.

ఇసుక రీచుల్లో అవకతవకలపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి

మాట్లాడుతున్న తిరుపతి

అక్షర దర్బార్, మహాదేవపూర్: ఇసుక రీచుల్లో జరుగుతున్న అవకతవకలపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని పలిమెల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీఎస్ఎండీసీ అధికారులు గుత్తేదారులు కుమ్మక్కై ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తోడుతున్నారని, పర్యావరణానికి ముప్పు వాటిల్లే విధంగా ఇసుక రీచ్ లను నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. మండలంలోని పంకనలో నిర్వహిస్తున్న ఇసుక రీచ్ లపై అధికారుల పర్యవేక్షణ కరువైందని ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని లేకుంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కమిషనర్ కు వినతిపత్రం

కమిషనర్ కు వినతిపత్రం ఇస్తున్న ప్రశాంత్

అక్షర దర్బార్, పరకాల : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పరకాల పట్టణంలో చేపట్టిన ఇండ్ల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ పరకాల మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్ మున్సిపల్ కమిషనర్ నరసింహకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే కొందరు గృహ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులే మామూళ్ల మత్తుకు అలవాటు పడి అక్రమ నిర్మాణాలకు అనుమతి ఇస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి చెప్పి చేతులు దులుపుకుంటున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ప్రశాంత్ కోరారు.

వైభవంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

కొండగట్టుకు తరలివెళ్తున్న భక్తులు

అక్షర దర్బార్, కొండగట్టు: కొండగట్టులో హనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టులో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీక్ష విరమణ కోసం హనుమాన్ మాలధారులు, భక్తులు భారీగా తరలివస్తున్నారు. రామ నామస్మరణతో కొండగట్టు మార్మోగుతోంది. కొండపైకి చేరేందుకు ఆర్టీసీ నాలుగు ఉచిత బస్సులను నడుపుతోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా..

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

అక్షర దర్బార్, కేసముద్రం : సంక్షోభంలో ఉన్న రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని,కల్తీ విత్తనాలు ఎరువులు విక్రయించే కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు బట్టు నగేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేసముద్రం మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు బట్టు నగేష్, కార్యదర్శి కొట్టం అంజయ్య మాట్లాడుతూ.. కల్తీ విత్తనాలు ఎరువులు అమ్మే కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, రుణమాఫీ తక్షణమే అమలు చేయాలని,పండించిన అన్ని రకాల ధాన్యాలకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి రెండు లక్షల రుణమాఫీని ఆగస్టు 15 నాటికి అమలు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. అన్ని పంటలకు ముందుగానే మద్దతు ధరలను, బోనస్ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల నాయకులు బెజ్జంకి బ్రహ్మచారి, అంబటి నాగమల్లు, వాంకుడోతు హథిరాం, బండి రాజు, డి రాజు, కొమురయ్య, కొమ్మనబోయిన మల్లయ్య, వీరయ్య ఓరుగంటి కృష్ణ, బెల్లి మురళి, దాసరి రాములు, లాదర్ల సారయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

కరెంటు కోతలకు కారకులెవరు..?

- గంటల తరబడి కోతలు విధిస్తున్న అధికారులు...
- గ్రామాల్లో మరీంత దయనీయ పరిస్థితి...
- వేసవిలో ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్న అధికారులు
- కొత్త ప్రభుత్వంలో 24గంటల కరెంట్ ఏదంటున్న ప్రజలు

అక్షర దర్బార్, కేసముద్రం : మార్పు అంటే ఏదో జరుగుతుందని అనుకున్నాం. మార్పు అంటే ప్రజల స్థితిగతులే మార్చేస్తారేమో అనుకున్నాం. గత ప్రభుత్వ వైఫల్యాలను రిపీట్ చేయకుండా పారదర్శకంగా పరిపాలన జరుగుతుందేమోనని కలలు కన్నాం. కానీ 24గంటల కరెంటు సప్లయ్‌లో నిత్యం సమస్యలు ఎదరవుతూనే ఉన్నాయి. ప్రతిరోజూ గంటల తరబడి కరెంటు కోతలు విధిస్తూ ప్రజలను అధికారులు ముప్పు తిప్పలు పెడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పరిధిలో నిత్యం కరెంటు కోతలు మిన్నంటాయి. రోజులో ఎన్ని దఫాలుగా కరెంటు పోతుందో.. అధికారులకు కూడా తెలియని దుస్థితి నెలకొంది. మరోపక్క అధికారులు మరమ్మత్తులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణాలను సాకుగా చూపించి.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది మొదలు.. నేటికి కరెంటు కోతలే విధిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో ఎక్కడా కరెంటు కోతలు విధించవద్దని విద్యుత్ అధికారులకు చెప్పినప్పటికీ.. సంబంధిత అధికారులు ఎందుకీ వైఖరి అవలంభిస్తున్నారనేది చర్చనీయాంశంగా మారింది. ఇక గ్రామాల్లోని పరిస్థితి చూస్తే పట్టణాలకు తక్కువ గ్రామాలకు ఎక్కువ అనే చందంగా నిత్యం కరెంటు కోతలే. దీంతో గ్రామాల్లోని ప్రజలకు కరెంటు కష్టాలు తీవ్రమయ్యాయి. రాత్రి వేళల్లో కరెంటు కోతలు విధించడంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు అయితే తట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. మార్పు రావాలి.. కాంగ్రెస్ రావాలి అంటూ గెలిపించుకుంటే కనీసం గతంలో ఉన్న విద్యుత్ సరఫరానైనా ఇచ్చే పరిస్థితి లేదని ఆయా గ్రామాల ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పరిపాలనను పక్కన పెట్టి.. కేవలం పేర్ల మార్పులు, చిహ్నాల మార్పు, గీతం అంటూ కాలయాపన చేస్తోందని, మొన్నటి వరకు కాళేశ్వరం.. నిన్నటి వరకు ఫోన్ ట్యాపింగ్ లీకులతో ముందుకు నెట్టుకొచ్చిందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ప్రభుత్వానికి పరిపాలన చేయడం చేతకావడం లేదని బీఆర్ఎస్ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనంత కరెంటు కోతలు విధిస్తున్నప్పటికీ.. మంత్రులు కరెంటు సప్లయ్ నిలిచి పోవడం లేదని స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. ఒక్కసారి గ్రామాల్లోకి వచ్చి గ్రామీణ ప్రాంత ప్రజల కరెంటు కష్టాలు స్వయంగా చూస్తే తప్ప.. ఏసీల్లో ఉండే వారికి తెలియవని అంటున్నారు. మరి ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం కరెంటు కోతలను విధించకుండా చర్యలు చేపడుతుందో లేదో వేచి చూడాల్సిందే మరి..

కరెంట్ కష్టాలను తీర్చాలి..

- మిట్ట గడుపుల మహేందర్, కేసముద్రం

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కరెంటు కోతలే ఉండకపోయేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది కరెంటు కష్టాలను తెచ్చింది. రాత్రి వేళలో నిత్యం కరెంటు కోతలే. మరి ప్రభుత్వ పెద్దలు కరెంటు కోతలే లేవంటూ డబ్బా కొట్టుకోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా ప్రజలకు ఇబ్బంది కలగకుండా కరెంట్ కష్టాలను తీర్చాలి.

పదవీ విరమణ పొందిన అధికారులను సన్మానిస్తున్న సీపీ

సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: పదవీ విరమణ అనంతరం పోలీస్ అధికారులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. వరంగల్ పోలీస్ శాఖలో సుధీర్ఘకాలంగా విధులు నిర్వహించి శుక్రవారం పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులను సీపీ ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ చేసిన ఇన్ స్పెక్టర్ బాలకృష్ణ, ఎస్సై మునిరల్లా, ఏఎస్సైలు సమ్మిలాల్, శ్యామ్ సుందర్, సమ్మయ్య, హెడ్ కానిస్టేబుల్ యాకూబ్ రెడ్డిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాతుడుతూ పోలీస్ శాఖలో క్లిష్టసమయాల్లో విధులు నిర్వహించి నేడు శాంతియుతమైన వాతరణం కల్పించడంలో వీరు ప్రధాన కారుకులని, నేటి తరం పోలీసులకు వీరు స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. కార్యక్రమములో ట్రైనీ ఐపీఎస్ శుభంనాగ్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతరయ్య, ఆర్ఐలు శ్రీధర్, స్పర్జన్‌రాజ్, చంద్రశేకర్, ఆర్ఎస్సై శ్రవణ్ కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్‌కుమార్ పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడ్డ ఇంజినీర్లు

అక్షర దర్బార్, హైదరాబాద్: భవన నిర్మాణానికి ఎన్వోసీ ఇవ్వడానికి ఇంజినీర్లు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ ఘటన శుక్రవారం జరిగింది. రంగారెడ్డి జిల్లా మణికొండ, నెక్నాంపూర్ కు చెందిన బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి భవన నిర్మాణానికి సంబంధించిన ఎన్వోసీ ఫైల్‌ను ప్రాసెస్ చేయడానికి, ఫార్వర్డ్ చేయడానికి రూ.2.50లక్షలు నీటిపారుదల శాఖ ఇంజినీర్లు డిమాండ్ చేశారు. రూ.లక్ష శుక్రవారం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే. బన్సీలాల్, అసిస్టెంట్ ఇంజనీర్లు కే.కార్తీక్, హెచ్.నిఖేష్ కుమార్, గండిపేట సర్వేయర్ పి.గణేష్ ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాదులోని రంగారెడ్డి రెడ్ హిల్స్ లో గల ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో ఈ దాడులు నిర్వహించారు. రూ.65వేలు బన్సీలాల్, రూ.35వేలు, నిఖేష్ కుమార్ నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

అక్షర దర్బార్, మహబూబాబాద్: అప్పుల బాధ తాళలేక మనస్థాపానికి గురై చెట్టుకు ఉరి వేసుకుని హెడ్ కానిస్టేబుల్ బత్తిని మనోహర్(50) ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్ పట్టణంలోని నరసింహనగర్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు మనోహర్ జిల్లా పోలీసు కార్యాలయంలోని పోలీస్ కంట్రోల్ రూంలో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నాడు.

విత్తన కొనుగోళ్లపై రైతులకు అవగాహన

అక్షర దర్బార్, మహాదేవపూర్ : విత్తనాల కొనుగోలుపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. శుక్రవారం పలిమెల మండలంలోని పంకెన గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారి ధర్మేంద్ర రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు షాపు యజమాని వద్ద తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా లూజు విత్తనాలు అమ్మితే వెంటనే సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు.

తొలితరం ఉద్యమకారులకు సన్మానం

అక్షర దర్బార్, మహాదేవపూర్ : 1969 లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసంపోరాడిన తొలితరం ఉద్యమకారులను మలితరం ఉద్యమకారులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. తొలితరం ఉద్యమకారుల పోరాట స్ఫూర్తితోనే మలితరం ఉద్యమం సాధ్యమైందని జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా నేడు మహాదేవపూర్ లో తొలి తరం ఉద్యమకారులను సన్మానించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని మలితరం ఉద్యమకారుల మహాదేవపూర్ మండల శాఖఅధ్యక్షుడు సట్ల సత్యనారాయణ అన్నారు. నాటి ఉద్యమాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆయన తెలిపారు. తొలితరం ఉద్యమ నాయకులైన ఎనమండ్ర రామన్ రావు, ప్రముఖ కవి తోపుచర్ల రంగారావు, ఎండీ రహీముద్దీన్, ఆరుట్ల వెంకటేశ్వర చారి, చిటికేసి కిషన్, తన్నీరు అంకమ్మ, ఎండీ షంషీర్ బేగ్, ఎండీ గయాస్ ఖాన్, పన్నాల కిషన్ రావు, మేసినేని కేశవరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మలితరం ఉద్యమకారులు మహాదేవపూర్ మండల అధ్యక్షుడు సట్ల సత్యనారాయణ, ఎండీ అయుబుద్దీన్, కలికోట దేవేందర్, ఆన్కారి ప్రభాకర్, జాడి గట్టయ్య, జనగామ పోషం, ఎండీ ఇర్షాద్ అహ్మద్, పిడుగు సమ్మయ్య, ఎండీ ముజాహిద్ ఖాన్, కేదారి ప్రవీణ్ కుమార్, బుద్ధ మహేష్, పోత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను సన్మానిస్తున్న సత్యనారాయణ

ఇసుక, మట్టి డంపును సీజ్ చేస్తున్న అధికారులు

ఇసుక, మట్టి డంప్ సీజ్

అక్షర దర్బార్, ఐనవోలు: నందనం గ్రామ రెవెన్యూ శివారులో అక్రమంగా నిల్వ చేసిన మట్టి, ఇసుకను అధికారులు సీజ్ చేశారు. అక్రమంగా నిల్వ చేశారని సమాచారం తెలుసుకున్న ఐనవోలు తహసీల్దార్ విక్రమ్ కుమార్, సబ్ ఇన్ స్పెక్టర్ అనిల్ కుమార్, మైనింగ్ ఆఫీసర్స్ లింగ మోరిగూడెం దగ్గర దాదాపుగా 450 ట్రాక్టర్ల మట్టితో కూడిన ఇసుకను పరిశీలించారు. పట్టా భూమిలో నిల్వచేసి ఉండడంపై అధికారులు చర్యలు చేపట్టారు. రాయల్టీ ఇన్ స్పెక్టర్ వి.చంద్రకళ, మైనింగ్ సర్వేయర్ పూర్ణ , ఐనవోలు మండల ఏఆర్ఐ మల్లయ్య తనిఖీల్లో పాల్గొన్నారు.

ముందే రుతుపవనాలు

అక్షర దర్బార్, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు దేశంలోకి అనుకున్న సమయాని కన్నా ముందే ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే త్రిపుర, మేఘాలయ, అస్సాం, బెంగాల్, సిక్కింలోకి ప్రవేశించాయని వెల్లడించింది. లక్షద్వీప్, కేరళ, కర్ణాటక, తమిళనాడు సహా పలు ప్రాంతాల్లోకి ముందే ప్రవేశించే పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపింది. అయితే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాయని వాతావరణ శాఖ గురువారం ప్రకటించింది. ఈశాన్య భారతంలోకి విస్తరించాయని తెలిపింది. సాధారణంగా జూన్ 1వ తేదీన నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయి. ఆ తర్వాత జూన్ 5 నాటికి అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ, మిజోరం, మణిపూర్, అస్సాం రాష్టాలకు చేరుకుంటాయి. ఈసారి రుతుపవనాల ఆగమనం సమయంలోనే బంగాళాఖాతంలో రేమాల్ తుఫాను ఏర్పడింది. రేమాల్ తుఫాను రుతుపవనాల గమనాన్ని బలంగా లాగిందని, అందుకే నిర్ణీత సమయానికి ముందుగానే అవి ఈశాన్య రాష్ట్రాలకు చేరుకున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు వివరించారు. 2017లో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. అప్పుడు కూడా రుతుపవనాల ఆగమనానికి కొద్ది రోజుల ముందు బంగాళాఖాతంలో మోరా తుపాను ఏర్పడిందని అధికారులు పేర్కొన్నారు.